
కథ

# నవ్వేజనా సుఖినోభవంతు

డాక్టర్ ఎం. సుగుణరావు



విశాఖపట్నం. రామకృష్ణా బీచ్. వైట్ హౌస్‌కు ఎదురుగా ఇసుకలో యాభైమందికి పైగా జనం గుండ్రంగా కూర్చున్నారు. వారి నుంచి వస్తున్న వింత వింత శబ్దాలు విని దగ్గరకు వచ్చిన వాళ్లంతా నవ్వుకుంటూ వెళ్లిపోతున్నారు. ఆ గుంపులో గోవిందం కూడా వున్నాడు. వారంతా పొట్టచెక్కల య్యేలా నవ్వుతున్నా గోవిందం ముఖంలో చిన్న నవ్వు కూడా మెరవడం లేదు. గుంపులో గోవిందంలా వుండిపోయాడు.

''ఇక నవ్వుల థెరపీ అయిపోయింది. జోకులు, షైకులు వదలండి'' అన్నాడు. ఆ గుంపుకు నాయకత్వం వహించిన వ్యక్తి.

ఆ గుంపులోని ఒక ఔత్సాహికుడు ఒక పిట్ట కథ వినిపించేడు. ''ఒక అబ్బాయి. ఒక అమ్మాయిని ప్రేమించాడు. నువ్ పెళ్లి చేసుకోకపోతే చనిపోతానన్నాడు. అలాగే చనిపోయాడు. అదీ అరవై ఏళ్ల తర్వాత!'' ఆ పిట్ట కథకు అందరూ నవ్వారు. 'ఇది ఆరుద్ర గారి కొసమెరుపు కథ' అనుకున్నాడే కానీ గోవిందం నవ్వలేదు.

ఇంకో వ్యక్తి షైకు వదిలాడు.

''నవ్వితే హ్యాపీ<br>
నవ్వకపోతే బీపి<br>
నవ్వని వాడు పాపి, మరియు ముక్కోపి<br>
బాస్ జోకేస్తే మాత్రం నవ్వేవాడు గోపి''

–ఈ కవితకూ గోవిందానికి నవ్వు రాలేదు. చాలా సేపటి నుంచీ గోవిందాన్ని గమనిస్తున్న ఆ లాఫింగ్ క్లబ్ సహచరుడు – ''ఏంటి సార్, అంతా విరగబడి నవ్వుతుంటే, తమరు నిశ్శబ్దంగా వుండిపోయారేం...నవ్వితే మీ నోటి ముత్యాలు రాలిపోతాయా?!'' అన్నాడు.

ఆ మాటలతో గోవిందంలోని బాధ ద్విగుణీకృతం అయ్యింది. మౌనంగా వుండిపోయాడు. కొద్ది క్షణాల తర్వాత నోరు విప్పుతూ–

''సార్ చిన్నప్పటి నుంచీ నాకున్న విచిత్రమైన కష్టం గురించి వింటే నవ్విపోతారు. నైట్రస్ ఆక్సైడ్ అంటే లాఫింగ్ గ్యాస్ గురించి మీరు వినే వుంటారు. అవి పీలిస్తే తట్టుకోలేనంతగా నవ్వుతాము. నేను అది పీల్చకపోయినా బాగా నవ్వేసేవాడిని. ఎవరైనా ఒక మాదిరిగా కనిపించినా, చిన్న జోక్ వేసినా'' అన్నాడు గోవిందం.

''మరయితే మీ జీవితంలో నవ్వులు ఎందుకు మాయం అయ్యాయి?'' అడిగాడు ఆ వ్యక్తి ఆసక్తిగా.

''మీరు ఓపికగా వింటానంటే నా స్కూలు రోజుల్లోకి వెళ్లి చెప్పాలి'' అన్నాడు గోవిందం.

''సరే చెప్పండి'' అన్నాడు సదరు సహచరుడు.

గోవిందం గొంతు సవరించుకుని చెప్పడం మొదలుపెట్టాడు.

''నేను నైంత్ క్లాస్‌లో చేరిన మొదటి రోజే మా తెలుగు మాస్టారు మొదటి పిరియడు తీసుకున్నారు. ఆయన పాఠం మధ్యలో ముక్కుపొడుం పీల్చి, తుమ్మేవారు. తుమ్మడం కోసం దాన్ని పీల్చి బలవంతంగా తుమ్ము తెచ్చుకోవడం ఎందుకు? దాంట్లో ఏం సుఖం వుంది? అని నేను అనుకున్న ఉత్తర క్షణంలోనే నాకు అలవోకగా నవ్వొచ్చేసేది. నేను అలా నవ్వడం ఆయన వారం రోజులు భరించి ఎనిమిదో రోజున తన ఆయుధం తీసారు. అది లావు పాటి పేముబెత్తం.

''ఏరా నవ్వుతావా? ఇప్పుడు ఏడువ్, చెయ్యి పట్టు'' అన్నారు. ఆ బెత్తం చూసేసరికి నా పై ప్రాణాలు పైనే పోయాయి. వెంటనే బుర్రలో ఆలోచన వచ్చింది.

''సార్! నాకు నవ్వు జబ్బు సార్... కావలిస్తే మా ఇంట్లో వాళ్లను అడగండి. నేను పుట్టినప్పుడు ఏడవలేదంట. పురుడు పోసిన మా నర్సమ్మ నా బుగ్గ గిల్లినా ఏడవలేదంట!'' అని గబగబా చెప్పేసాను.

–గోవిందం మాటలకు సదరు సహచరుడు అడ్డొస్తూ...

''మీకు నవ్వు జబ్బా!''అన్నాడు ఆశ్చర్యంగా

''అలాంటిదేమీ లేదు. అనవసరంగా నవ్వే దురలవాటే తప్ప అలాంటిదేమీ లేదు. దెబ్బలు తప్పించుకోవడానికి అలా అబద్ధం చెప్పేను. అంతే.

నన్నుకొట్టడానికి బెత్తం ఎత్తిన తెలుగు మాస్టారు నా వంక జాలిగా చూసి ''పోరా'' అంటూ ఊరుకున్నారు.

–ఆ రోజు నుంచీ నేను స్కూల్లో చదివిన ఆ రెండేళ్లు నేను కొత్తగా అంటించుకున్న ఆ నవ్వు జబ్బు బలవంతంగా కొనసాగించవలసి వచ్చింది'' అన్నాడు గోవిందం.

''బావుంది మీ నవ్వుల ఎపిసోడ్ ఇంట్రస్టింగ్‌గా వుంది.....కొనసాగించండి'' అన్నాడు ఆ సహచరుడు.

గోవిందం మళ్లీ చెప్పడం మొదలుపెట్టాడు.

''నేను కాలేజీలో చేరిన తర్వాత ఈ నవ్వే దురలవాటు మరీ ఎక్కువయింది. నాకు ఇద్దరు కోతుల్లాంటి స్నేహితులు తగిలారు. వాళ్లల్లో ఒకడు రంగ, మరొకడు శేషు. ఇద్దరూ క్లాసుల్లోని అమ్మాయిలకు పేర్లు పెట్టేవారు. ఒక రోజు క్లాసులో మాస్టారు సీరియస్‌గా పాఠం చెపుతున్న సమయంలో ఎత్తు పళ్లున్న అమ్మాయికి దంతేశ్వరి, తపతి అనే అమ్మాయికి చపాతి అని నిక్ నేమ్‌లు పెట్టి నా నోట్ బుక్‌లో రాసారు. ఆ నోట్ బుక్‌ని ఎవరో క్లాసు జరుగుతుండగానే ఆ అమ్మాయిలకు అందజేసారు. ఆ పేర్లు చదివిన దంతేశ్వరి నా వంక పళ్లు నూరుతూ చూసి ''పళ్లు రాలగొడతా'' అంది తపతి కూడా చేతులు తిప్పుతూ ''చపాతీ పిండి పిసికినట్లు పిసుకుతా'' అంది. వారి డైలాగులు విన్న వెంటనే నేను పూనకం వచ్చిన వాడిలా పెద్దగా పగలబడి నవ్వేను. వెంటనే లెక్చరరు నా వికటాట్ట హాసానికి చిరాకుపడి నేను అలా నవ్వినందుకు నన్ను చీవాట్లు వేసారు. వెంటనే నేను నా నవ్వు జబ్బు గురించి ఆయనకు మనవి చేసుకోబోయాను. రెండో సారి నా పాచిక పారలేదు.

''నాన్సెన్స్ అలాంటి జబ్బు లేదు. పిచ్చెక్కిన వాళ్లు మాత్రమే నవ్వుతారు. ఆర్ యూ మేడ్'' అంటూ క్లాసులో అందరి ముందు చీవాట్లు వేసారు. అలా నా నవ్వు మూలంగా నవ్వుల పాలయ్యాను.'' అంటూ నిట్టూర్పు విడిచాడు గోవిందం.

గోవిందం మాటలు అంతవరకూ నవ్వుతూ ఆలకించిన ఆ సహచరుడు ఏడుపు ముఖం పెట్టి '' మహాశయా మీరు పుట్టింది లగాయతూ, కాలేజీకి వచ్చేవరకూ చరిత్ర అంతా చెప్పుకొచ్చారు. అసలు విషయం ఆయిన నవ్వెందుకు మాయం అయిందో చెప్పలేదు'' అన్నాడు.


''సార్ పూర్తిగా వినండి... ఇంకా చాలా కథ వుంది.'' అంటూ మళ్లీ చెప్పడం ప్రారంభించాడు.

''నేను డిగ్రి పాసయ్యి బ్యాంకులో గుమస్తాగా చేరే సమయానికి పిచ్చి నవ్వుల గోవిందంగా ప్రచారంలోకి వచ్చేసాను. ఒక రోజు బ్యాంకులో పనిచేసుకుంటున్నప్పుడు, ఒక పల్లెటూరి కస్టమరు, కొత్తగా అకౌంట్ తెరవడానికి అప్లికేషన్ పూర్తి చేస్తూ 'సెక్స్' అనే కాలమ్‌లో ఏం సమాధానం రాయాలో అర్థం కాక, నన్ను అడిగాడు.

''మీరు ఆడా, మగా ఏ కోవకు చెందుతారో రాయాలి'' అంటూ నేను సమాధానం చెప్పేంతలో...

ఆ పక్కనే వున్న ఇంకో పెద్ద మనిషి ''ఆ కాలమ్ పెద్దవాళ్లకు మాత్రమే వర్తిస్తుంది'' అంటూ ఏదో చెప్పబోయాడు.

అతడి అవివేకానికి నాకు గట్టిగా నవ్వొచ్చింది. ఆ నవ్వు మరీ ఉధృతంగా మారి మా సహచరులకు ఆ విషయం తెలిసి అందరూ గట్టిగా నవ్వారు. మేం





**బతుకు మీద విరక్తి కలిగి ముఖంలో దిగులు కనపడేందుకు అనేక ప్రయత్నాలు చేసాను. ఆ ప్రయత్నాలు ఫలించి నేను అతిగా నవ్వడం కాదు అసలు నవ్వు అనేది మర్చిపోయే దశకు చేరుకున్నాను.**

నవ్వడం చూసి ఆ అపార్థసారథికి కోపం వచ్చి, బ్యాంకుకు వచ్చిన వినియోగదారుల్ని గౌరవించక పోగా నవ్వుతున్నారు అంటూ నా మీద మా పై ఆఫీసుకు ఫిర్యాదు చేసాడు. దాని ఫలితంగా నాకు పై ఊరుకు బదిలీ...

ఈ నేపథ్యంలో నేను పిచ్చిగా నవ్వుతాననే ప్రచారం బాగా ఊపందుకోవడంతో, ఈ పిచ్చోడికి పిల్లనివ్వం అంటూ నాకు పెళ్లి కావడం ఒక సమస్య అయింది. పిచ్చి కుదిరితేనే గానీ పెళ్లి కాదు, పెళ్లయితేనే గాని పిచ్చి కుదరదు. ఈ సమస్యకు పరిష్కారంగా నా పిచ్చి నవ్వుల్ని తగ్గించుకోవడానికి అనేక ప్రయత్నాలు ప్రారంభించాను.

సినిమా టిక్కెట్టుతో పాటు జేబురుమాలు ఉచితంగా ఇచ్చే తెలుగు సినిమాలు, కరుణరసపూరిత తెలుగు టీవి ధారావాహికలు చూడడం, రేషన్ షాపు క్యూలో నుంచోవడం, రిజర్వేషన్ లేకుండా జనరల్ కంపార్టుమెంటులో ప్రయాణం... ఇలా బతుకు మీద విరక్తి కలిగి ముఖంలో దిగులు కనపడేందుకు అనేక ప్రయత్నాలు చేసాను. ఆ ప్రయత్నాలు ఫలించి నేను అతిగా నవ్వడం కాదు అసలు నవ్వు అనేది మర్చిపోయే దశకు చేరుకున్నాను. ఆ విధంగా నా పెళ్లి జరిగింది. పెళ్లయిన తర్వాత ఈ సీరియస్‌నెస్ ఎక్కువయిపోయింది. అంతవరకూ హాయిగా ఇష్టమైన హోటల్‌లో భోంచేసి, వారానికో సినిమా, నెలకో పార్టీతో ఆనందంగా గడిపిన నాకు పెళ్లవగానే బ్రతుకు 'బర్‌బాద్' అయిపోయింది. నా ఇంటి దేవత రాగానే, నవ్వుల దేవత నా జీవితంలోంచి శాశ్వతంగా తప్పుకుంది, అంటూ నిజంగానే ఏడ్చేసాడు గోవిందం.

''అయ్యో... మీకెంత కష్టం వచ్చింది? నవ్వు అవసరం లేదనుకున్న మీరు, లాఫింగ్ క్లబ్‌లో చేరి నవ్వు ఎందుకు ప్రాక్టీసు చేస్తున్నట్లు?'' అన్నాడు అంతవరకూ ఓపికగా గోవిందం గొడవ విన్న ఆ శ్రోత.

గోవిందం మళ్లీ చెప్పడం ప్రారంభించాడు.

''ఈ మధ్యనే బ్రాంచి మేనేజరుగా ప్రమోషన్ వచ్చింది. ఇది వరకు జరిగిన పొరపాట్లకు భయపడి కస్టమర్లతో సీరియస్‌గా మాట్లాడడం, అసలు నవ్వకపోవడంతో నా మీద కొంతమంది కస్టమర్లు మరో ఫిర్యాదు వదిలారు. 'మీ శాఖాధిపతి దుర్వాసుడు, విశ్వామిత్రుడు సంతతికి చెందిన వాడిలా కనిపిస్తున్నాడు. కస్టమర్లను నవ్వుతూ పలకరించకుండా ముఖం మాడ్చుకుని మాట్లాడుతున్నాడు. ఇలాంటి వాడికి మేం డిపాజిట్లు ఇవ్వం' అంటూ హెడ్ ఆఫీసుకి వర్తమానం పంపారు. చూసారా? నా జీవితంతో ఎలా ఆడుకుంటున్నారో? నవ్వినంత కాలం ఎందుకు నవ్వుతావ్? అన్నారు. ఇప్పుడు సీరియస్‌గా వుంటుంటే కోపధారి, దారి గోదారి అంటున్నారు. ఇందాక మన నవ్వుల క్లబ్ సహచరుడు చెప్పినట్లు నాకు హ్యాపీ లేదు. బీపి తప్ప. నా ఆరోగ్యం కోసం, మా ఖాతాదారులకు నవ్వుతూ సేవలు అందించేందుకు బలవంతంగా మర్చిపోయిన నా నవ్వులు తిరిగి తెచ్చుకునేందుకు ఇలా లాఫింగ్ క్లబ్బులో చేరాను. ఎందుకంటే నేనిప్పుడు నవ్వడం మర్చిపోయాను'' అన్నాడు ముక్తాయింపుగా గోవిందం.

''సరే, మీరు నవ్వుల రాజుగా వెలుగుతారనీ, నవ్వే జీవిత పరమావధిగా ఎదుగుతారనీ, ఆశీర్వదిస్తున్నాను'' అంటూ అంతవరకూ సంభాషించిన సహచరుడు తిరిగి నవ్వుల అభ్యాసంలో మునిగిపోయాడు.

గోవిందమూ కళ్లు మూసుకుని తనూ ఆయన లాగా తన నవ్వుల ప్రాక్టీసు కొనసాగించాడు. ఐదు నిమిషాల తరువాత...

''గోవిందం!'' అనే పిలుపు వినబడడంతో కళ్లు తెరిచాడు. ఎదురుగా తన నైంత్ క్లాస్ తెలుగు మాస్టారు, ఆయన భార్య.

ఊపిరి పీలుస్తూ, వదులుతూ నవ్వుల థెరపీని అభ్యసిస్తున్న గోవిందాన్ని ఆయన పరిశీలనగా చూస్తూ..

''ఏరా గోవిందం... నీ జబ్బు ఇంకా తగ్గలేదా? పాపం బాగా ముదిరిపోయినట్లు వుంది. దీనికి మందు లేదేమో!'' అన్నాడు సానుభూతిగా..

గోవిందానికి క్షణం సేపు ఆయన ఏం మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు.

ఆయన మళ్లీ గోవిందం వైపు జాలిగా చూసి ''పాపం వీడికి చిన్నప్పటినించీ నవ్వు జబ్బే. వెకిలిగా నన్ను చూసి నవ్వుతున్నాడని కొట్టబోయాను'' అంటూ వాళ్లవిడతో చెప్పాడు. క్షణం తర్వాత ఆయన చొక్కా జేబులోంచి ముక్కుపొడుం డబ్బా తీసి చిటికెడు ముక్కులోకి దట్టించి గట్టిగా తుమ్మాడు.

– అప్పటికి గోవిందానికి బల్బు వెలిగింది.

మేస్టారు తను చిన్నప్పుడు ఆడిన అబద్ధాన్ని పూర్తిగా నమ్ముతూ చేసిన వ్యాఖ్యలతో పాటు ఆయన ముక్కుపొడుం విన్యాసాలు ప్రదర్శించడంతో అతడిలో అంతవరకూ రాకుండా పోయిన నవ్వు లావాలా పైకి ఉబికింది. 'చాలా సంవత్సరాల తరువాత మనస్ఫూర్తిగా నవ్వేను' అనుకున్నాడు గోవిందం. ఆ నవ్వు తెరలు తెరలుగా సాగింది.

నవ్వుతున్న గోవిందాన్ని చూస్తూ జాలిపడుతూ–

''పోనీలేరా! అదృష్టవంతుడివి. నవ్వుతూనే చస్తావ్'' అంటూ ఆ తెలుగు మాస్టారు వాళ్లావిడతో అక్కడి నుంచి కదిలాడు.

అంతవరకూ గోవిందంతో, అతడి తెలుగు మాస్టారు మాట్లాడిన సంభాషణ విన్న సహచరుడు వెంటనే...

''అయ్యా... ఇంతవరకూ మీతో మాట్లాడిన పెద్ద మనిషి మీ చిన్నప్పటి తెలుగు మాస్టారని నా కర్థమయిపోయింది. చూసారా సృష్టి విచిత్రం. ఆయన మూలంగానే మీరు పగలబడి నవ్వుతున్నారు. అంటే భూమి గుండ్రంగా వుంది అనడానికి ఇదీ ఒక నిదర్శనమే!'' అన్నాడు.

సహచర లాఫింగ్ క్లబ్ సహచరుడి విశ్లేషణకు మళ్లీ నవ్వకుండా వుండలేకపోయాడు గోవిందం.

''నవ్వేజనా సుఖినోభవంతు!'' అంటూ అతడి సహచరుడు అతడి నవ్వుతో శృతికలిపాడు.

★